క్లుప్తంగా

అభివృద్ధి పనులపై ఓఎస్డీ సమీక్ష

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా ఆయా శాఖల అధికారులతో సోమవారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీడబ్ల్యూఐడీసీ, ఎండోమెంట్, శిల్పారామం, ఆర్‌డబ్ల్యూఎస్, మార్కెటింగ్, ఏరియా ఆసుపత్రి, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులతో ఆయా పనుల పురోగతిపై పలు సూచనలు చేశారు. వాటర్ గ్రిడ్, కాలువ పనులు, ఏరియా ఆసుపత్రి, గండి ఆలయ అభివృద్ధి పనులు, పులివెందుల శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. అభివృద్ధి పనులలో వేగంపెంచాలని అధికారులను ఆదేశించారు. పనులలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షలో ఆయా శాఖల ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో నిరసన ర్యాలీ



జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన ర్యాలీ

ఎర్రగుంట్ల : తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీపీపీలో జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన కార్యక్రమం సోమవారంకు మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీపీపీ పవర్ హౌస్ గేటు నుంచి ప్రారంభమై పొంటైన్ వద్ద ఉన్న ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుల విగ్రహాలకు పూలమాల వేసి తమ డిమాండ్లను తెలియజేశారు. జేఏసీ నాయకులు ఉద్యోగులు, కార్మికులు పాల్గొని ప్రసంగించారు.

ప్రజల సమస్యలను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలవద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని అలాగే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలకు, నాయకులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి రావడం కోసం ప్రతి కార్యకర్త, నాయకులు తమవంతు ప్రయత్నం చేయాలన్నారు.


ఆలయ హుండీల లెక్కింపు

వేంపల్లె : వేంపల్లెలోని పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించామని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. శ్రీవృషభాచలేశ్వరస్వామి హుండీలు లెక్కించగా రూ.2,996లు.. అనుసంధానంలోని వేంపల్లెలోని మెయిన్ బజార్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హుండీలు రూ. 33,764లు, కడప రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలు రూ.94,907లు..మొత్తం కలిపి రూ.1,31,667ల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్, ఆలయ సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ మహాసభలను విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : ఈనెల 20, 21వ తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర ఎన్‌జీఓ సంఘ మహా సభలను విజయవంతం చేయాలని పులివెందుల తాలుకా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు జగన్నాథరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఎన్‌జీఓ సంఘ కార్యాలయంలో ఆయన ఎన్‌జీఓ సభ్యులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ఎన్‌జీఓ మహాసభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు రాష్ట్ర కౌన్సిలర్లు హాజరవుతారన్నారు. పులివెందుల తాలుకాలోని ఎన్‌జీఓ సంఘ సభ్యులందరూ ఈ కార్యక్రమానికి తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణారెడ్డి, ట్రెజరర్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భవాని పీరుకు వెండి గొడుగు బహుకరణ



వెండి గొడుగుతో రిటైర్డు లెక్చరర్ రామచంద్రయ్య

పులివెందుల టౌన్ : పీర్ల పండుగ సందర్భంగా పట్టణంలోని అంకాలమ్మపేట భవాని పీరుకు రిటైర్డు లెక్చరర్ జి.రామచంద్రయ్య రెండున్నర కేజీల వెండి గొడుగును బహుకరించారు. రామచంద్రయ్యకు భవాని పీరు ఆశీస్సులు కలగాలని నిర్వాహకులు తెలిపారు.

టమాటా సాగుపై రైతుల దృష్టి

- 5వేల ఎకరాలకుపైనే టమాట సాగు
- ఎకరాకు రూ.40 వేలకు పైనే పెట్టుబడులు
- ధరలు ఉండటంతో సాగుపై రైతుల ఆసక్తి

వేముల : ఈ ఏడాది టమాట సాగుపై రైతులు దృష్టి సారించారు. సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నా సాగుకు రైతులు వెనుకాడటంలేదు. అయితే ఈ సారి ఊహించని విధంగా టమాట ధరలు పెరగడంతో రైతుకు ఊహించని ఆదాయం వచ్చింది. ప్రతి ఏడాది టమాట సాగు చేస్తున్న రైతులు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో సాగుకు సాహసించలేకపోయారు. ఎన్ని నీటి తడులు అందించినా ఎండకు మొక్కలు ఎండిపోవడంతో సాగు చేసిన కొంతమంది రైతులు నష్టపోవాల్సి వచ్చింది. దీంతో రైతులు ఉష్ణోగ్రతలు తగ్గడంతో టమాట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా రైతులు డ్రిప్ కింద పంటను సాగు చేశారు. గత ఏడాది సాగులో నష్టపోయిన రైతులు ఈ ఏడాది సాగు చేశారు. ప్రస్తుతం ఉన్న ధరలు లేకపోయినా అంతో.. ఇంతో ఆదాయం ఉంటుందనే ఆశ రైతులలో బలంగా ఉంది.

నియోజకవర్గంలో 5వేల ఎకరాలలో.. :

పులివెందుల నియోజకవర్గంలో 5వేల ఎకరాలకుపైనే పంటను రైతులు సాగు చేసుకున్నారు. వర్షాలు కురిసి ఎండలు సాధారణస్థాయికి రావడంతో టమాటపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే 5వేల ఎకరాలలో సాగు చేయగా.. 10వేల ఎకరాలకు పెరుగుతుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో సాహు, నందిని 440, 448అనే రకాలను సాగు చేస్తారు. ఇందులో సాహు అనే రకం ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది.



వేల్పుల వద్ద సాగు చేసిన టమాట పంట

సాగులో పెరిగిపోతున్న పెట్టుబడులు :

సాగులో ఎకరాకు 12 నుంచి 14 వేల మొక్కలను నర్సరీలలో తెచ్చుకుని సాగు చేస్తున్నారు. ఒక్కొక మొక్క 65 పైసల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు 8 వేల నుంచి 10 వేల వరకు మొక్కలకు రైతులు ఖర్చు చేస్తున్నారు. మొక్కలు నాటినప్పటి నుంచి పంటపై ఊహించని పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. మొక్కలకు డిమాండ్ పెరగడంతో నర్సరీ యజమానులు ఒక్క మొక్కపై 5 నుంచి 10 పైసల వరకు పెంచుతున్నారు. సాగుపై దృష్టి పెట్టిన రైతులు చేసేదిలేక నర్సరీల యజమానులు నిర్ణయించిన ధరకే తెచ్చుకుని సాగుచేస్తున్నారు.

టమాట సాగులో ముందు జాగ్రత్త చర్యలు :

టమాట పంటకు ఎక్కువగా ముడత తెగులు ఆశిస్తుంది. దీంతో రైతులు ముందు జాగ్రత్తగా మందులను పిచికారి చేస్తున్నారు. పంటకు వారానికొకసారి మందులను పిచికారి చేయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. పంటకాలం నాలుగు నెలలు, పంట సాగు చేసిన 80 రోజులకు సాగులో దిగుబడులు చేతికొస్తాయి. అప్పటి వరకు పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. మొక్కలు ఏపుగా పెరిగేందుకు వారానికొకసారి నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ ద్వారా పంటకు అందిస్తారు.

2ఎకరాలలో సాగు చేశా



నాకున్న 2 ఎకరాలలో టమాట సాగు చేశా. నందిని అనే రకం సాగు చేశా. నర్సరీలో మొక్క 65 పైసలకు కొనుగోలు చేసి తెచ్చి నాటాను. ఇప్పటికే సాగుచేసి 50 రోజులు కావస్తోంది. మరో 20 రోజులలో తోటలలో టమాట కోతకు వస్తాయి. ఇప్పటికే ఎకరాకు రూ.35 వేలకుపైనే పెట్టుబడులు పెట్టా. కోతకు వచ్చే సమయానికి ధరలు ఉంటాయనే ఆశ ఉంది.

– చిన్న ఉత్తన్న (టమోట రైతు), సిద్ధంరెడ్డిపల్లె

ధరలు ఉంటాయనే సాగు చేస్తున్నారు



టమాటలో దిగుబడులు చేతికొచ్చే సమయానికి ధరలు ఉంటాయనే రైతులు సాగు చేశారు. ఇప్పటికే రైతులు సాగు చేసి నెల దాటింది. నియోజకవర్గంలో 5 ఎకరాలలో సాగైంది. సాగు ఇంకా పెరిగే అవకాశం ఉంది. తోటలలో దిగుబడులు అందే సమయానికి ధరలు ఉండేలా రైతులు సాగు చేశారు. మార్కెట్‌లో ఏ మేరకు ధరలు ఉంటాయో వేచి చూడాల్సిందే.

– రాఘవేంద్రారెడ్డి(హెచ్‌ఓ), పులివెందుల

టెన్త్ ఓపెన్ పరీక్షలకు అడ్మిషన్లు ప్రారంభం

పులివెందుల టౌన్ : పదవ తరగతి పూర్తి కాకుండా వ్యక్తిగత లేదా ఆర్థిక కారణాలతో చదువు మానేసిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూలు సొసైటీ వారు ఓపెన్ స్కూలు విధానం ద్వారా 10వ తరగతి పరీక్షలు 2024 ఏప్రిల్ హాజరు కావడానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని ఎంఈఓ వీరారెడ్డి తెలిపారు. ఆగస్టు నెలాఖరులోగా అడ్మిషన్లకు చివరి తేదీ అని.. 14 ఏళ్లు పూర్తైన వారు ఆధార్ కార్డు కలిగి కనీసం 1వ తరగతిలో చేరి చదువు మానేసిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని పదవ తరగతిలో చదువు మానేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9441501680, 7799214489 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

యూనిఫాం పంపిణీ



సిబ్బందికి యూనిఫాంను పంపిణీ చేస్తున్న చిన్నప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డులో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సోమవారం మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప రెండు జతల యూనిఫాంను పంపిణీ చేశారు. సెక్రటరీ రాజు, అరుణ్, లావణ్య, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

ఎర్రగుంట్ల :మున్సిపల్ పరిధిలోని వార్డులలో ఉన్న ప్రజా సమస్యలపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఆయన చాంబర్‌లో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ మాట్లాడుతూ వార్డులలో నెలకున్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రతి సమావేశంలో అజెండాలో ఖర్చుల చిట్టాతో పాటు ప్రతిపాదనలు అమోదించమని పెడతారే కానీ కనీసం ప్రజా సమస్యలు ఏంత వరకు పరిష్కారమయ్యాయో అధికారులు తెలపరన్నారు. అధికారులు చెస్తున్న తప్పిదాలకు కౌన్సిలర్లు బాధ్యులు అవుతున్నారన్నారు. మున్సిపల్ పరిధిలో పన్నుల మోత అధికంగా ఉందని విస్తీర్ణం తక్కువ ఉన్నా పన్నులు అధికంగా వేస్తున్నారన్నారు. కొలతలు వేసి పన్నులు తగ్గించమంటే అధికారులు పట్టించుకోలేదన్నారు. సమస్యల పరిష్కారాలపై దృష్టి పెడతామని కమిషనర్ పి. జగన్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జెబూన్నీసా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ

పశు వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : కమలాపురంలోని పశు వైద్య కశాశాలలో పనిచేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పశు పోషకుల ఫిర్యాదు మేరకు సోమవారం స్థానిక పశువైద్య శాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9 గంటలకు సిబ్బంది రావాల్సి ఉండగా 9.42కు ఒకరు రాగా తర్వాత తాపీగా సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే పాడి పరిశ్రమ రైతులతో పాటు ప్రసాద్‌రెడ్డి అక్కడ వేచి ఉన్నారు. పశు సంవర్ధక శాఖ ఏడీ ఉత్తన్నతో పాటు మరో ఇద్దరు సిబ్బంది ఉన్నప్పటికి కనీసం ఒకరైనా సమయానికి రావచ్చు కదా? అని ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు, పశు సంవర్ధక శాఖ జేడీకి ఆయన ఫోన్‌లో కమలాపురం పశు వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పశు పోషకులు ఉదయం పూటనే వైద్య చికిత్సల కోసం వస్తారని, అయినప్పటికి సిబ్బంది రాకపోవడం ఏంటని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి సమయపాలన పాటించి ప్రజలకు సేవ చేయాలన్నారు.



పశు వైద్య సిబ్బంది కోసం వేచి ఉన్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పశు పోషకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పులివెందుల రూరల్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయంలో పులివెందుల డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ర్యాలీగా వెళ్లి నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ నాయకులు అశోక్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్, పే రివిజన్, కాంట్రాక్టు కార్మికులు, గ్రేట్ జేఎల్ఎం, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ, చనిపోయిన గ్రేడ్-2 జేఎల్ఎం కుటుంబానికి ఉద్యోగం తదితర సమస్యలను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్, జగదీశ్వరరెడ్డి, సెక్రటరీ గురుమోహన్‌రెడ్డి, డివిజన్‌కు సంబంధించి అన్ని సెక్షన్ల నుంచి ఏఈ, కాంట్రాక్టు వర్కర్స్, పలువురు జేఏసీ నాయకులు, తదితర యూనియన్ నాయకులు, లైన్‌మెన్ షిఫ్ట్ ఆపరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహం వద్ద వినతిప్రతంతో ఉద్యోగులు

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

పులివెందుల టౌన్ : టీడీపీ అధినేత చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అంటూ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారన్నారు. చంద్రబాబుకు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రాజెక్టులు గుర్తుకొస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, నూరుల్లా, బండి రామ్మోహన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నచెప్పలిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, డ్రైనేజ్, విద్యుత్ స్తంభాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఏ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అందుకే ప్రభుత్వ సిబ్బంది అంతా ప్రజల ముంగిటకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. చంద్రబాబు నాయుడు దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు సైతం అమలు చేసిన నాయకుడు సీఎం జగనన్న మాత్రమేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, బుజ్జన్న, అమీన్‌జాన్, పుల్లారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, కొండారెడ్డి, గండిచ భాస్కర్, లక్ష్మీనారాయణరెడ్డి, నిఖిల్ రెడ్డి, రాజారెడ్డి, పెద్దచెప్పలి చిన్ని, మత్రి సుబ్బన్న, నామాలశేఖర్, చంద్రపాల్, చంటి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వల్లూరు : కమలాపురం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముగ్గురికి ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన ముగ్గురు లబ్ధిదారులకు రూ.7,60,000 చెక్కులను అందచేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స పొందడానికి అవకాశం కల్పిస్తూ వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఆరోగ్య శ్రీ పథకానికి జీవం పోసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. దీనితో పాటు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆరోగ్రశ్రీ ద్వారా చికిత్సలు పొందిన వారికి వారు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే కాలానికి ఆరోగ్య ఆసరా ద్వారా నగదు అందిస్తూ ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల వైఎస్ఆర్‌సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కష్టపడి ఇష్టపడి చదవండి

వేంపల్లె : ప్రతి ఒక్క విద్యార్థి బాగా కష్టపడి ఇష్టపడి చదవాలని, భవిష్యత్ గుర్తింపు సాధించాలని వేంపల్లె మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి కోరారు. సోమవారం స్థానిక మఠం వీధిలో ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మానవ సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులతోపాటు మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, మానవత సంస్థ అధ్యక్షుడు బాలాజీ, డైరెక్టర్లు రంగయ్య, రాజారాం, ఇసీ మెంబర్ రహీం, మాజీ సర్పంచ్ నాగ సుబ్బారెడ్డి, హాస్టల్ వార్డెన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహనుండాలి

చెన్నూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యాన సంచాలకులు ఎస్ఎస్‌వీ సుభాషిణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం మండలంలోని ఉప్పరపల్లికు చెందిన జగన్మోహన్ రెడ్డి అనే రైతు పంటలను పరిశీలించారు. రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడాలని ఆమె సూచించారు. ఉత్పత్తుల సేకరణ కేంద్రం, శీతల గది ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే శాశ్వత పందిరి ఏర్పాటు చేసుకుని తీగజాతి కూరగాయలు సంవత్సరం పొడువునా సాగు చేసుకోవచ్చని, తేనె టీగల పెట్టెలను పెట్టుకోవాలని ఉద్యాన అధికారి జ్యోతీర్మయి రైతులకు తెలిపారు. వ్యవశాయ అధికారి శ్రీదేవి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

చెన్నూరు : మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ గంగసపల్లె సురేష్‌బాబు తెలిపారు. సోమవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలకు సచివాలయ సిబ్బంది తనిఖీ నిమిత్తం వచ్చినప్పుడు వారికి ఉపాధ్యాయులు సహకరించాలని, అలాగే గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వే పూర్తిచేయాలని తెలిపారు. మండలంలో డ్రాపౌట్స్ లేకుండా ఉండాలనీ విద్యాహక్కు చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీత, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

పోలీస్‌స్టేషన్‌లలో సీసీ కెమెరాలు

– కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: కడప పోలీస్‌సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తెలియజేశారు. సోమవారం సాయంత్రం కడప డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి మానిటరింగ్ చేసే విధంగా సీసీ కెమెరాలను ప్రతి పోలీస్‌స్టేషన్ ఆవరణంలోనూ, లోపలున్న గదులు, ప్రదేశాల్లో ఏర్పాటు చేశారన్నారు. వాటి పనితీరును, నిఘాను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తారన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సన్మానం

కడప అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన పి. అన్నపూర్ణను జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయవాదుల సంఘం భవనంలో న్యాయవాదుల సంఘం , న్యాయసేవాసదన్‌లో ఉద్యోగుల సంఘం సోమవారం ఘనంగా సన్మానించింది. ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి అన్నపూర్ణ మాట్లాడారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా వివిధ హోదాల్లో అందరి సహకారంతో పనిచేశామన్నారు. కడపలో న్యాయవాదులు ఎంతగానో సహకరించారన్నారు. కేవలం 30 రోజులు మాత్రమే పని చేశానన్నారు. కడప నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, కడప ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కవిత, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.ఎస్. బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక అరుంధతినగర్‌కు చెందిన తుమ్మలురు వెంకటమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి ఈ విషయాన్ని తెలుసుకుని ఆ కుటుంబానికి పోచమరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చెన్నూరు సోషల్ మీడియా కన్వీనర్ ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం



పులివెందులలో డప్పువాయిద్యాల నడుమ కొనసాగుతున్న పీరు ఉత్సవం



సింహాద్రిపురంలో ఖాదర్‌వలి పీరు ఉత్సవం



లింగాలలో పీర్లను ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలో మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం సోమవారం అంకాలమ్మ గుడి ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు మస్తాన్‌స్వామికి చక్కెర చదివింపులు ఇచ్చి పూలమాలలు, వెండి గొడుగులను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను అగ్నిగుండప్రవేశం చేసి గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో విచిత్ర వేషధారణలు, డీజే సౌండ్స్‌లతో ఉత్సవం జరిగింది. ఈ పీర్ల ఉత్సవం జెండామాను వీధి నుంచి గాడిచర్ల వీధి, అమ్మవారిశాల, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్ వరకు చేరుకుంది. అనంతరం స్వామివారిని జల్దికి తీసుకెళ్లారు. దీంతో మస్తాన్‌స్వామి పీరు ఉత్సవం ఘనంగా ముగిసింది.

నేటి నుంచి భవాని పీరు ఉత్సవం :

పట్టణంలోని మారుతి హాలు రోడ్డు సమీపంలో ఉన్న భవాని పీరు ఉత్సవం మంగళవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ పీరు ఉత్సవంలో పట్టణం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి భవాని పీరును దర్శించుకోనున్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని ఖాదర్‌వలిస్వామి ఉత్సవ పీరు ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీరు ఉత్సవాలను పురస్కరించుకుని పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ప్రతిష్ట చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ధర్మకర్త భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వాహకుడు అచ్చుకట్ల మస్తాన్‌వలి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అగ్ని గుండ కార్యక్రమం నిర్వహించి మంగళవారం జలసమాధితో ఉత్సవాన్ని ముగిస్తారు. అలాగే మహబూబ్ సుభాని ఉత్సవ పీరు, గురిజాలలోని మస్తాన్ ఉత్సవ పీరు ఆదివారం ప్రతిష్ఠించి సోమవారం జలసమాధితో ముగిశాయి. రాత్రి అగ్నిగుండ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు. ఉత్సవాలను ఎస్ఐ రోషన్ పర్యవేక్షించారు.

లింగాలలో..

లింగాల : మొహరం ఉత్సవాలలో భాగంగా జార్తల పీర్ల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పీర్లను ఎత్తుకుని అగ్ని గుండ ప్రవేశం చేశారు. అదేవిధంగా యువకులు దవడలకు ఇరువైపులా కోడి కత్తులను దించుకుని పోటేషిక దారణలో చిందులేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు.